# ఆ పికిరిపందలు!

డాక్టర్ రాఘువన్ ఇంటి వరండా దీపం వెలుతురులో, కాంపౌండు గేటు ముందు, ఒక సరసమైన బాల్జాక్ నవల చదువుతూ అందులో పూర్తిగా లీనమైపోయాడు. అతని ఎడం చెయి వేలొకటి సూచనకోసం చదువుతున్న పేజీని అణచుకొనివుంది; ఇంకొక చెయితో అతను సిగరెట్టు కాలుస్తున్నాడు.

ఒక నిమిషం సడలించుకొని రాఘువన్ వాలుకుర్చీలో కొంచెం కదలాడు.

అప్పుడు ఏడుగంటలే అయింది. పక్కనేవున్న బోర్డు సందేశం ప్రకారం అది డాక్టరు పేషంటులని చూసే సమయం. ఐతేనేం, రోగులు ఎవరూ లేనప్పుడు డాక్టరు ఉత్తికే ఆఫీసులో కూర్చోవాలా ఏమిటి? ఇటువంటి సమయాల్లో తరచుగా రాఘువన్ స్నేహితులు అతన్ని చూడడానికి వస్తూవుంటారు; ఇవాళ ఎవరూ రాలేదు.

రాఘువన్ ఇంట్లో రెండు భాగాలున్నాయి; ముందున్నది వైద్యశాల, వెనుకనుండేది అతను కాపురముంటున్న విడిది. ఇప్పుడు వంటవాడు రామన్ నాయర్ వంటగదిలో తన మాతృభాష మళయాళంలో ఏదో పాడుతూ పనిచేస్తున్నాడు; వాడూ త్వరలో వెళ్ళిపోతాడు. రాఘువన్ ఒక బ్రహ్మచారి. అతనికి పుస్తకాలు తప్పిస్తే మరేం సాహచర్యం లేదు. అసలు, అతనికి మరెవరి సహవాసం కావాలనికూడా లేదు. కాని తను - ***కాసనోవా అనుభవాలు, లేడీ ఛాటర్లీ ప్రేమికుడు*** - లాంటి శృంగార, కామోత్తేజక నవలలు చదివి, వాటిలో అతిరసమైన కొన్ని పదాలు, పదబంధాలు, వాక్యాల క్రింద గీతగీసినతరువాత, తన స్నేహితులకి ఆ నవలలోని తన సాహిత్య అభిరుచిని – అపచారమైన ధోరణిలో, మోటు భాషలో, ఎటువంటి ఆటంకం లేకుండా నిర్మొహమాటంగా - తెలియజేయాలని రాఘువన్ చురుగ్గా తొందరపడుతున్నాడు.

చెయిలోని నవలని అతనింకా పూర్తిగా చదవలేదు; అందుకే అతను ఇవాళ స్నేహితులనెవరినీ కలుసుకోడానికి బయటకి వెళ్ళలేదు.

అతను కళ్ళు మూసుకొని, ఊపిరిని లోపలికి బాగా ఈడ్చి, సిగరెట్టు మొనని తీసి పారేసి, మళ్ళీ ఆ నవలని చదవసాగాడు. సిగరెట్టు పొగ, ధూళిలో తన దృష్టికి ఆటంకం కలిగిందని గ్రహించి, కళ్ళద్దాలని తీసి, తుడిచి, తొడుక్కొని, మళ్ళీ ఆ నవలలోని ఘటనలలో చొచ్చుకున్నాడు. అంతరాత్మలో తేలుతున్న స్మరణ క్రమంగా మొహంలో ఒక చిరునవ్వుగా కనిపించింది; త్వరలో ఆతని హృదయంలోని భావనలు ఆ నవలలోని పద్దెనిమిదవ శతాబ్దంలోని ఫ్రెంచు మహిళల వివాహేతర సంబంధాలు, ఆ అపనిందల వర్ణనలని గుర్తుచేసుకున్నాయి.

సాహిత్యంలో అతనికున్న విపరీత అభిరుచి, మాటవాసికీ రాఘువన్ పలికే పచ్చి బూతులూ, సంభాషణలూ, వాటి మోటుతనం విని అతని స్నేహితులు మూతిముడుచుకునేవారు. ముఖాముఖిగా అతని మాటల్లోని హాస్యం, చతురోక్తి గ్రహించి ఆనందించినా, లోలోపల వాళ్ళ మనసులో అతనిగురించి విరుద్ధ భావాలే చోటుచేసుకున్నాయి. కొందరికి అతని ప్రవర్తనలో కళంకం ఉందేమో అని అనుమానమూ కలిగింది; కాని నిజమేమిటంటే రాఘువన్ నడతలో ఏ దోషమూ ఎవరూ కనిబెట్టలేదు. ఇప్పుడు అతనికి ముప్పైదేళ్ళు నిండాయి; అతనొక ఖాయమైన బ్రహ్మచారి అని అందరికీ తెలుసు.

మరికొందరికి రాఘువన్ రహస్యంగా తప్పైన జీవితం నడుపుతున్నాడేమో అని సందేహం: తన అంతరంగ జీవితం దాచుకోవాలనే అతని ఉద్దేశమా? అందుకేనా అతను పలికే ఈ మితిమీరిన మాటలన్నీ? ఐతేసేం, తమ అనుమానం రూఢీ చెయ్యాలనే వాళ్ళు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమే అయ్యాయి.

ఐతేసేం, లైంగిక విషయాల్లో తనకున్న మితిమీరిన ఆసక్తి, ఇక స్నేహితుల చర్చలలో తను తెలియజేసే దృఢమైన అభిప్రాయాల గురించి రాఘువన్కి ఎటువంటి ఈర్ష్యా, అసూయా లేవు. సంభోగం అన్నది మగ ఆడ జన్మలమధ్య ఒక పవిత్రమైన సమర్పణ అని అతని నిశ్చితమైన నమ్మకం. తనగురించిగాని తన వ్యక్తిగత జీవితంగురించిగాని ఇతరులేమనుకుంటారనే చింత, వాళ్ళు తన్ను అపార్థం

చేసుకుంటారేమో అనే వ్యాకులత అతనికి రవంతైనా లేదు. అతని అభిప్రాయాలకి మూలకారణం స్వార్థం కాదు. ఒక వేదాంతిలాగ అతను ఈ ప్రపంచాన్ని అన్ని కోణాల్లోనూ అన్వేషిస్తున్నాడు: అంటే, ఒక ప్రవీణుడు నిష్పక్షపాతంగా కళని విమర్శించినట్టు అన్న మాట. జరుగుతున్నదేదో, సమబుద్ధితో, ఒక మూడవ మనిషిలాగ విమర్శించే వివేకం తనకుంది. ఆ విధంగా తను అలవఱచుకున్న బోధనలు ఇతరులకి అనాగరికంగా, అసహ్యంగా - ఏం, జుగుప్సగాకూడా - కనిపించవచ్చు! ఐతేసేం, దానిగురించి రాఘవన్కి ఏ చింతా లేదు; ఇంకా చెప్పాలంటే తన అభిప్రాయల ఘనతగురించి ఆతనికి కొంచెం గర్వంకూడా ఉంది.

ఆడ మగ మధ్య ఆకర్షణ ప్రకృతిలో సహజమనే సత్యం అతని సమగ్ర దృక్పథంకి ఆధారంగా స్థిరపడిపోయింది. తన తీర్పులూ, తను ఇతరులతో పంచుకున్న మాటలూ ఆ సత్యాన్నే పొగడుతున్నాయనీ, ధృఢీ చేస్తున్నాయనీ అతని వాదం. అందువలనే తన అనావృత అంతరంగ భావనలు నిరాటంకంగా, బాహటంగా ప్రకటన చెయ్యడానికి రాఘవన్ జంకలేదు; ఇతరులు ఆమోదించాలని తన భావనలని 'సుకుమారంగా', యధోచితంగా 'అలంకరించే' పనులేవీ అతను పూనుకోలేదు.

'అసలు సాధారణ జనులకి లైంగిక సంబంధం అంటే ఎందుకు మొహమాటం? వాళ్ళ అవగాహనలో అదొక అసభ్యతగా మారిపోయిందే? అదేదో అందరూ అన్యాయంగా పాల్గొనే ఒక కుట్ర, ప్రయాస అని వాళ్ళు భావిస్తున్నారే? ఎందుకు?'

ఈ ప్రశ్నలని దీర్ఘంగా ఆలోచించి రాఘవన్ అసలు కారణమేమిటో కనిబెట్టాడు:

'లైంగిక విషయాల మాటకివస్తే, ప్రతీ జీవి మనసులోనూ - ఆడా, మగా, ఎవరైనా సరే - దాన్ని వ్యక్తిగత కోణంలో చూసే అలవాటే చోటుచేసుకుంది. ఒక చిత్రం కానీ లేక ఆడ మగ సంభోగంని వర్ణించే దృశ్యం కానీ, దాన్ని చూసినప్పుడు దూరంగా నిలబడి అదొక సహజమైన మానవ స్వభావమని ఎవరూ భావించడం లేదు; తామే అందులో పాల్గొన్నట్టు, అది తమ సొంత అనుభవం అని వాళ్ళు కల్పన చేసుకుంటున్నారు.

మగవాడు తన్ను ఆ చిత్రంలోని, దృశ్యంలోని మగవాడితో సరిపోల్చుకుంటాడు; ఆడదికూడా అలాగే ఆ పరాయి స్త్రీలో తన్ను ఊహించుకుంటుంది; అంటే ఒక మూడవ మనిషిలాగ అన్వేషించే ధోరణి అక్కడ కనిపించదు. ఈ వ్యక్తిగత అంశంవలన ఆ

సమయంలో జనులకి కలిగేది అసూయ, స్వార్థాశయం; మోసం చేస్తున్నామని వాళ్లు సిగ్గుపడతారు. ఎటువంటి లైంగిక సూచనలోనూ వాళ్ళు అనుభవించేది ఆత్మచైతన్యమే. తమ భావనలగుర్చి లోలోపల సంతోషించినా, వాటిని బయటకి తెలియజేయరు; అదీ మోసమే కదా?'

రాఘువన్ వాదంలో న్యాయం, వివేకం ఉన్నాయనిపించవచ్చు, కాని అతని స్నేహితులు అతని విపరీత బుద్ధి చూసి అసహ్యించుకున్నారు; క్రమంగా అతనితో చుట్టరికం తగ్గించుకున్నారు; అతన్ని కలుసుకోడానికి వచ్చే రోగుల సంఖ్యకూడా తగ్గుతూ వచ్చింది.

కాని రాఘువన్ మనసులో దానిగురించి ఏ బాధా లేదు; అతని నడవడిలో ఏ మార్పూ లేదు. అతనికి కావలసిన పుస్తకాలు వాడుకగా వివిధ దేశాలనుంచి అతనికి వచ్చి చేరుతున్నాయి. అతనికి మరేం కావాలి?

ప్రస్తుతం తను చదువుతున్న నవలలో ఒక అధ్యాయం ముగించిన తరువాత, రాఘువన్ ఒక కొత్త సిగరెట్టు కాల్చడానికి సిద్ధమైయ్యాడు; పక్కనే, గోడకి ఆనుకోనివున్న సిగరెట్టు డబ్బాని అందుకున్నాడు.

అది ఖాళీగా ఉంది; రాఘువన్ ఇంట్లోకి తిరిగిచూసాడు. అప్పుడే రామన్ నాయరు వంటగదిలో చిల్లరపనులు ముగించుకొని, తడిసిన తువాలుతో మొహం తుడుచుకొని, అతని ఎదుట కనిపించాడు.

భాషల ఆటంకం వలన రాఘువన్ ఏమంటున్నాడో, అతని మనసులో ఏముందో రామన్ నాయర్ ఎరగడు. ఐనా రాఘువన్ రోజూవారీ ఎటువంటి నిర్ణయమైన పద్ధతీ, ఏర్పాటూ లేకుండా జీవించే మనిషి అని అతనికి తెలుసు. అతను వేళకి తప్పి భోజనం చెయ్యడం, కొన్నిరోజుల్లో పుస్తకాలు చదువుతూ అసలు భోజనమే వద్దని విడిటిబెట్టడం - ఇవన్నీ చూసి వాడికి రాఘువన్ మీద సానుభూతి ఉంది. వాడి పని రాత్రిపూట వంట చెయ్యడం, వంటగది శుభ్రం చెయ్యడం, అంతే. కాని తను వెళ్ళేముందు తన చేతులతో డాక్టరుకి వడ్డించాలని రామన్ నాయర్ ఎదురు చూసాడు, ప్రతీ రాత్రీ అటువంటి అవకాశం దొరకాలని ఆశించాడు. కొన్నిరోజుల్లో డాక్టరు పుస్తకం చదువుతూ తన్ను చూడసేలేదనిపిస్తుంది. "మీరిక భోజనం చెయ్యండి, నేను వెళ్ళనా?" అని చిరునవ్వుతో

వాడు అడిగినప్పుడు రాఘవన్ ఆ మాటల్లోని అర్థం గ్రహించక “సరే!” అని వెంటనే ఆమోదించడం జరుగుతుంది. అనేకసార్లు రామన్ నాయర్ వంటగదిని చేరుకున్నప్పుడు తను ముందు రాత్రి వండినదదేదీ డాక్టరు తాకనేలేదని ఊహించి చాలా బాధ పడేవాడు.

“మీరిప్పుడు భోంచేస్తారా?” అని నాయర్ అడగ్గానే రాఘవన్ వాడిని వింతగా చూసాడు; ఒక క్షణం అసలు వాడిని పిలచిన కారణంకూడా మరిచిపోయాడు.

“నాకు ఆకలి లేదు. నాకొక కొత్త సిగరెట్టు డబ్బా నా గదిలోనించి తీసుకురా. ఆ తరువాత నువ్వు వెళ్ళవచ్చు” అని చెప్పాడు.

రామన్ నాయర్ సిగరెట్టు డబ్బా అందించి, వెంటనే కాంపౌండు  గేటు ద్వారా నిష్క్రమించాడు; రాఘవన్ ఒక సిగరెట్టు వెలిగించి మళ్ళీ నవల చదవసాగాడు.

అతను కొత్త అధ్యాయంలో ఒక సరసమైన ఘటన చదువుతూంటే ఎవరో గేటు తెరిచే ధ్వని వినిపించింది. కళ్ళద్దాలని పైకెత్తి రాఘవన్ చూసాడు. చీకటిలో మొహం తెలియకపోవడంతో తన మిత్రుడెవడైనా  వస్తున్నాడేమో అనే అనుమానంతో అతనికి సంతోషం కలిగింది. తనింకా ఈ నవలని పూర్తిగా చదవలేదు; ఐతేనేం, వచ్చే మిత్రుడితో పిచ్చపాటికి కావలసినంత సరుకు తనవశం ఉందని గ్రహించి రాఘవన్ ఆతురతతో గేటుపక్క తిరిగాడు; అప్పుడే వచ్చినది ఒక స్త్రీ అని తెలిసింది.

మామూలుగా రాఘవన్ చూసే పేషంటులందరూ మగవారే; వాళ్ళని చూసే సమయమూ దాటిపోయింది. ఐతే తన్ను వ్యక్తిగతంగా చూడాలని వచ్చిన స్త్రీని ఎలా నిరాకరించడం? ఒక కుర్చీ లాగ్గొనివచ్చి రాఘవన్ ఆమెను కూర్చోమన్నాడు.

ఆమెను తను ఇంతకుముందు చూసినట్టు జ్ఞాపకం వచ్చింది. మెల్లమెల్లగా ఆ గుర్తుకి సంబంధించిన ఘటనలు మనసులో లేచాయి; కాని ఆమె పేరు జ్ఞాపకం రాలేదు.

తనకి జ్ఞాపకం ఉందని తెలియజేయాలని ఆమె అమ్మమ్మ గురించి రాఘవన్ అడిగాడు. ఆమె ఏమీ అనక తల వంచుకుంది; ఏదో ఆలోచిస్తూ గోరు కొరుకుతూనేవుంది.  ఆమె దృష్టి తనమీద పడనేలేదని గ్రహించి రాఘవన్ ఆమెని తీవ్రంగా పరిశీలించాడు.

రెండు సంవత్సరాలముందు చూసినప్పుడు ఆమె చావుకి సమీపంలో ఉన్నట్టు కనిపించింది; ఇప్పుడామె స్థితి ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఆమె దేహం మాత్రమేకాదు, ఆమె జీవితమే పూర్తిగా ధ్వంసమైనట్టు సూచనలు కనిపించాయి. ఆమె కట్టుకున్న చీర  మరుగుపడిన ఒక చింపిగుడ్డలాగుంది.

ముంజేయి మీద వాలిన కన్నీటి చుక్కని తుడుచుకుంటూ, పెదిమలు వణుకుతూంటే, ఆమె మాటాడింది: “అమ్మమ్మ పోయి ఒక సంవత్సరం ఐపోయింది.”

రాఘువన్ ఒక నిట్టూర్పు వదిలాడు; తన దృష్టిని వేరే దిశలో మళ్ళించాడు.

ఆ ముసలమ్మ మొహం అతని మనసులో తేలుతూనేవుంది. మనవరాలంటే ఆవిడకి ఎంత వాంఛ! ఒక పాత ఘటన గుర్తుకి వచ్చింది. “నీ పేరు?” అని అడిగాడు.

తలెత్తకుండా, అతన్ని చూడకుండా ఆమె జవాబు చెప్పింది: “రాధ . . . ”

ఆమె పలికిన కొన్ని క్షణాలముందు అతనికీ ఆ పేరు గుర్తుకి వచ్చింది.

“రాధ . . . ” అని గొణుకుతూ  రాఘువన్ ఆమెను చూసాడు. రాధ తలెత్తి అతన్ని చూసింది. ఆ ముఖంలో ఎటువంటి భావావేశం కనిపించలేదు. కళ్ళలో శూన్యం; కాంతి మచ్చుకైనా లేదు. ఒకానొకప్పుడు పేరుపొందిన రాజభవనం ఇప్పుడు తన అందాలన్నీ పోగొట్టుకొని శిధిలమై కనిపించినట్టుంది ఆమె వాలకం; ఆమెను చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుంది.

స్వభావంగా రాఘువన్ ఆమె పేరు మరిచిపోయాడు; కాని ఆమెగురించి అతనికి బాగా తెలుసు.

ఒకరోజు, రెండు సంవత్సరాలముందు, ఇదే సమయంలో రాధ అమ్మమ్మ, దిగులుతో, ఏడుస్తూ రాఘువన్ ముందు నేలలో మోకరించి, అరచేతులు రెండూ కలుపుకొని  బతిమాలింది; అప్పుడు రాఘువన్ వాలుకుర్చీలో ఏదో చదువుతున్నాడు. “డాక్టరుగారూ, మీరే కాపాడాలి! మేం నిరుపేదలం! మాకెవరూ లేరు! మీరు దయచేసి నాతో రావాలి!” అని అతన్ని పిలిచింది; ముసలమ్మని ఓదార్చి రాఘువన్ ఆమెవెంట నడిచాడు.

తన ఇంటి పరిసరాలు దాటి వెళ్ళినప్పుడే రాఘువన్ తన ఇరుగుపొరుగులు ఎంత దిక్కుమాలిన స్థితిలో ఉన్నాయని గ్రహించాడు. ముసలమ్మ వెనుక నడుస్తూ, కొన్ని

సందులు దాటినతరువాత, ఎలాగో తన కాళ్ళు మురికిగుంటలలో పడకుండా కాపాడుకున్నతరువాత, ఆఖరికి ఒక గుడిసెముందు ఆగాడు.

ముసలమ్మ అతన్ని బయట కాచుకోనివుండమని చెప్పింది. లోపలికి వెళ్లి ఒక అగ్గిపుల్లతో దీపం వెలిగించింది.

ఒక మూల, గోడ పక్కన, ఒక యువతి పడుకొనివుంది. ఒక క్షణం రాఘవన్ పరిస్థితి మితిమీరిపోయిందేమో అని భయపడ్డాడు. ముసలమ్మ దీపాన్ని యువతి దగ్గరకి పోనిచ్చి “రాధమ్మా, ఇలా చూడు . . . డాక్టరుగారు వచ్చారు!” అని చెప్పింది.

“కొంచెం జరగండి,” అని ముసలమ్మకి చెప్పి రాఘవన్ యువతి కనురెప్పలు చూసాడు; చెయిని అందుకొని నాడి పరీక్షించాడు.

“అబ్బా, ఎంతపని చేసింది ఈ అమ్మాయి! నేను నమ్మలేకున్నాను!” అని ముసలమ్మ వాపోయింది: “డాక్టరుగారూ, దేవుడులాగ వచ్చారు, మీరే మమ్మల్ని కాపాడాలి!”

అసలు ఏం జరిగిందో వివరంగా చెప్పమని రాఘవన్ ముసలమ్మని అడిగాడు.

ముసలమ్మ చీరమొన నోరులో దోపుకొని మాటాడింది: “అదేదో ఘోరమైన మందు ఈ అమ్మాయి తాగేసింది!” అని అంటూ ఒక చిన్న ఎల్యూమినం గిన్నె అతనికి అందించింది. రాఘవన్ దాన్ని వెలుతురులో పరీక్షించి, వాసన చూసాడు. గిన్నెని నేలమీదపెట్టి తనిక ఏంచెయ్యాలని ఒక నిమిషం ఆలోచించాడు.

“డాక్టరుగారూ, మేం నిరుపేదలం . . . అమ్మాయికి ఆపద ఏం లేదుకదా?” అని ముసలమ్మ బతిమాలుతూ అతని కాళ్ళముందు వాలింది. ‘మరేం భయం లేదు’ అని రాఘవన్ ఆమెను ఓదార్చాడు. దీపాన్ని గోడలోని గూడులో పెట్టి, దాని వెలుతురులో తన మందుల సంచినుండి ఒక సిరింజ్ బయటకి తీసాడు. ఒక చిన్న బుడ్డి-సీసానుంచి మందు ఊడదీయడానికి సిద్ధమైయ్యాడు.

నీళ్ళు కావాలని అతను అడగ్గానే ముసలమ్మ ఆ ఎల్యూమినం గిన్నెని మళ్ళీ చూపించింది. ‘మరేం గిన్నె లేదా?’ అని డాక్టరు కోపంతో అడుగుతున్నారని గ్రహించగానే ఆమె చేతులు వొణికాయి.

"మరేం భయం వద్దు! మీ అమ్మాయికి ఏ ఆపదా లేదు," అని ఆమెకి రూఢిగా చెప్పి రాఘవన్ ఇంజెక్షన్ ఇవ్వడానికి పూనుకున్నాడు.

ముసలమ్మ మరొక పెద్ద గిన్నెలో నీళ్ళు తెచ్చింది. "ఇది నా కూతురు కాదండీ - నా మనవరాలు. బాల్యంలోనే అనాధ ఐపోయింది. అంతా కర్మ . . . నిజం చెప్పాలంటే అదే నన్ను చూసుకుంటోంది. నేనసలు బతికివున్నానంటే దానికి ఇదే కారణం! . . . నన్ను వదిలేసి తను చావాలని ఎందుకు ఇలా చేసిందో నాకు తెలియదు!" అని ఏడ్చింది.

ఆమె మాటలు రాఘవన్ గుండెని పొడిచాయి; కాని అతని మొహంలో ఎటువంటి చలనమూ కనిపించలేదు.

ఇంజెక్షన్ ఇవ్వడమైంది.

వెళ్ళేముందు రాఘవన్ ముసలమ్మకి కొన్ని మాత్రలు ఒక పొట్లాంలో ఇచ్చాడు. "మరేం భయం వద్దు. కొంచెంసేపట్లో మీ మనవరాలుకి మెలకువ వస్తుంది. అప్పుడు ఒక గ్లాసు మజ్జిగ ఇవ్వండి. మజ్జిగ లేకపోతే నీళ్ళివ్వండి," అన్నాడు.

"సోడా నీరు ఇవ్వచ్చా?"

"తప్పకుండా . . . సోడా నీరూ మంచిదే . . . రేపు ఉదయం నన్ను ఆఫీసులో వచ్చి చూడండి. మీ మనవరాలికి ఎలావుందో చెప్పండి."

రాఘవన్ మళ్లీ ఒకసారి యువతిని కళ్ళప్పగించి చూసి నిష్క్రమించాడు.

"డాక్టరుగారు ఎంత పుణ్యాత్ములు!" అని ముసలమ్మ మనసార అతనికి తన కృతజ్ఞత చెప్పింది.

ఆ ఘటన తరువాత రెండుమూడుసార్లు ఆ యువతి రాఘవన్ ఆఫీసుకి వచ్చింది; అతనడిగిన అన్ని ప్రశ్నలకి ఆమె తల వంచుకునే జవాబు చెప్పింది. ఆ నోరెత్తని భావనలూ, సైగలూ, యువతి అప్పుడప్పుడు క్లుప్తంగా ఇచ్చిన జవాబులూ విని యువతిని పీడించే 'రోగం' ఏమిటని రాఘవన్ తెలుసుకున్నాడు.

అసలు విషయమేమిటని రాఘవన్ బాగా ఆలోచించాడు: అతని అవగాహనలో ముసలమ్మకీ, యువతికీ గుండె ధైర్యం లేదు; బాహటంగా తమ ప్రశ్నలని ఎదిరించే సత్తువ లేనేలేదు. అందువలనే ఈ చెయిదాటిన పరిస్థితిలో వాళ్ళు చిక్కుకున్నారు.

యువతి తన బాల్యంలోనే తల్లిదండ్రులని కోల్పోవడం వలన ఒక దిక్కుమాలిన పక్షిగా ఐపోయింది; ఆఖరికి ఈ ముసలమ్మే ఆమె సంరక్షణకి బాధ్యత వహించింది. అలాంటప్పుడు యువతికి ఆత్మహత్యగురించి ఎలా ఆలోచన కలిగింది?

ఆరోజు ముసలమ్మ అన్న మాటలు రాఘవన్ ఇప్పుడు గుర్తుచేసుకున్నాడు:

". . . అంతా కర్మ . . . నిజం చెప్పాలంటే అదే నన్ను చూసుకుంటోంది. నేనసలు బతికివున్నానంటే దానికి ఇదే కారణం! . . . నన్ను వదిలేసి తను చావాలని ఎందుకు ఇలా చేసిందో నాకు తెలియదు!"

డాక్టరుని చూడడానికి వచ్చినప్పుడెల్లా యువతిలోని ఆత్మగౌరవం రాఘవన్ గమనించాడు. మందులు తీసుకున్నప్పుడు నియతంగా రెండు రూపాయలు చెల్లించడం ఆమె అలవాటు చేసుకుంది.

'నన్ను కాపాడినందుకు మీకు నేను ఇవ్వకలిగినది ఇంతే!' అని కృతజ్ఞతతో, కన్నీరు కార్చుతూ ఆమె చెప్తున్నట్టు అతనికి అనిపించింది. ఆ కంఠధ్వనిలోని వ్యాకులత అతనికి అర్థమైంది. పెదిమలు వణుకుతున్నా, చిరునవ్వుతో రాఘవన్ చెప్పాడు: "అవును, నేను చేసేది వ్యాపారం, కాని నేను అందరు పేషంటులదగ్గరా ఫీజ్ తీసుకోను." ఆమె ఇచ్చిన డబ్బు వద్దని నిరాకరించాడు. యువతి మరేం అనక నిలబడడం చూసి ఎదుటనున్న బెంచిలో కూర్చోమన్నాడు; ఒక క్షణం ఆగి అకస్మాత్తుగా ఆమెను అడిగాడు:

"నేనేదో జాడగా అడుగుతున్నానని అపార్థం చేసుకోవద్దు . . . నువ్వు చేసే ఉద్యోగంగురించి ఏమైనా చెప్తావా?"

యువతి రెప్పలార్పకుండా అతన్ని చూసింది. అతని మనసులో తనగురించి దురభిప్రాయం ఉందేమో అని గ్రహించి, నిమ్మళంగా జవాబు చెప్పింది: "నేను ఎటువంటి నేరమూ, పాపమూ చెయ్యలేదు. నేను ఒక పెద్ద పొరబాటు చేసాను. ఒక మగవాడిని ప్రేమించి మోసంపోయాను. అందుకే . . . (దాన్ని) . . . పోగొట్టుకోవాలని నిశ్చయించాను" అని తనలో గొణుక్కున్నట్టు మాటాడింది. తన కడుపులోనున్న శిశువుని త్యజించిన సంగతి గురించి ఆమె ఏమీ అనలేదు; కాని అదే ఆమె మనసుని ఆకట్టుకొనివుంది.

స్వభావంగా రాఘవన్ కి క్రూరమైన మనసు. "నువ్వు ఆ పోయిన శిశువుగురించి మాటాడుతున్నావా?" అని అడిగేసాడు.

అతని మాటలు రాధ మనసుని, దేహాంని పేధించాయి. కన్నులు తడిసిపోయాయి. తల వంచుకుంది. "నేను నా శిశువుని హత్య చెయ్యదలచుకోలేదు. ఆత్మహత్యకే పూనుకున్నాను. ఒక పాపం చేసినతరువాత నాకు జీవించడానికి ఇష్టం లేదు!" అని చెప్పి ఆమె వెక్కుతూంటే  రాఘవన్ ఆమెను ఆపాడు.

"నువ్వు చెప్పకుండానే నాకదంతా బోధపడింది . . . నా ప్రశ్నకి నువ్వు జవాబు చెప్పలేదు . . . అసలు నీ ఉద్యోగం ఏమిటి? ఒక యువతి తను  పాపం చేసానని బాధపడుతూ రోజులు గడిపితే అందరూ తన్ను అపార్థం చేసుకుంటారని కల్పించుకుంటుంది. ఇక నీ మాటకొస్తే నీ పొరబాటు ఆత్మహత్యకి చేసిన ప్రయత్నం కాదు. దానికిబదులు నువ్వుగాని ఆ మగవాడికి కొంచెం ధైర్యం ఇచ్చివుంటే ఇటువంటి పరిస్థితి వచ్చుండేదేమో . . . ?"

యువతి ముఖంలో జ్వాల లేచింది; అతన్ని ఆపింది.

"ఏమన్నారు, ధైర్యం ఇవ్వాలా? ఎవరైనా ధైర్యం నేర్పగలరా?" ఆమె కంఠధ్వని క్రూరంగా మారడంతో అందులో అలుక, నిర్దయ డాక్టరుకి పూర్తిగా అర్థమైయ్యాయి. "అసలు పిరికిపందలమాటకొస్తే వాళ్ళకెలాగ ధైర్యం నేర్పడం సాధ్యం?"

ప్రచండమైన ఆ మొహం చూసి, యువతికి ఏ మగవాడో ద్రోహం చేసాడని రాఘవన్ తెలుసుకున్నాడు.

కొంత సమయం ఆగి, ఆమె మానసికావస్థ మార్చాలని రాఘవన్ మెల్లగా అడిగాడు.

"నీ ఉద్యోగం ఏమిటో నువ్వు నాకు చెప్పనేలేదు. పెద్దగా చదువులేని నీలాంటి ఆడపిల్లలకి ఉద్యోగమంటే అదొక పెద్ద ప్రశ్న కదా? అందుకే నేనడిగాను."

రాధ ఇప్పుడు శాంతంగా జవాబు చెప్పింది.

"నా ఉద్యోగం గురించి నేను చెప్పినది విని మేమందరం ఒకేలాగ అని అపార్థం చేసుకోవద్దు; అదే నా మనవి. అన్ని ఉద్యోగాల్లోనూ మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ ఉంటారు."

ఒక నిమిషం ఆగి ఆమె చెప్పింది: "నేను ఒక నటి."

రాఘవన్కి సినిమాలు చూసే అలవాటు లేదు; ఆమె పేరుతో తనకి పరిచయం లేదని ఊహించాడు.

"అంటే . . . సినిమాల్లోనా?" అని అడిగాడు.

ఆమె వట్టిబోయిన నవ్వుతో జవాబిచ్చింది:

"సినిమాల్లో కాదు. నేను నాటకాల్లోనే నటించాను. ఒకప్పుడు నాకు సినిమాల్లో ఛాన్సు దొరుకుతుందని ఎదురుచూసాను, కాని అలాగేం జరగలేదు."

రాఘవన్ కి ఆమెగురించి అంతే తెలుసు. ఆ తరువాత రాధ కొన్నిసార్లు -మందులు కావాలని - వైద్యశాలకి రావడం జరిగింది. రాఘవన్ ఆమెతో ఒక మాటకూడా మాటాడలేదు. ఆమెని ఓదార్చాలనిగాని, ఆమె జీవనోపాధి మార్చాలనిగాని అతను పూనుకోలేదు. ఉపదేశాలు, బోధనలు - వీటిగురించి అతనికి ఎటువంటి నమ్మకమూ లేదు.

ఈ రెండు సంవత్సరాలలో రాఘవన్ మనసులో రాధగురించి ఎటువంటి జ్ఞాపకాలూ లేకపోవడం సహజం. కాని ఇప్పుడు ఆమె పరిస్థితి ముందుకంటే అధ్వాన్నంగా ఉందని చూసినతరువాత  అందుకు కారణమేమిటో తెలుసుకోవాలనే కోరిక అతనికి కలిగింది.

ఈ రెండు సంవత్సరాలలో ఆమె ఇరవైయేళ్ళు ఎదిగినట్టు కనిపించింది; వచ్చినప్పటినుంచి తలెత్తకుండా శాంతంగా మాటలాడింది.

"అసలు నువ్వెందుకు ఇలా ఉన్నావ్? మీ అమ్మమ్మ పోయినతరువాత నీ ఆరోగ్యం బాగా చెడిపోయిందన్నమాట!" అని రాఘవన్ అన్నాడు.

ఆమె నోరెత్తలేదు; తల వంచుకొనేవుంది; రాఘవన్ ఇంతసేపూ ఓర్పుతో కాచుకొనివున్నాడు, ఇక భరించలేక అడిగేసాడు: "సరే, నువ్వెందుకు ఇప్పుడు ఇక్కడ వచ్చావ్?"

"నేను శిశుహత్య చెయ్యలేను - ముందటిలాగ. నాకు మీరు సాయం చెయ్యాలి."

ఇప్పుడు రాఘవన్ మరేం అనక తల వంచుకున్నాడు. అతని మౌనం గమనించి యువతి చెప్పింది: "నాకు వేరే లేడీ డాక్టరుని చూడడానికి వీలుకాదు."

రాఘువన్ తలెత్తి ఆమెను చూసాడు; ఇప్పుడు తను చూస్తున్నది రెండు సంవత్సరాలముందు తను చూసిన యువతికి పూర్తిగా విరుద్ధం అని వెంటనే తెలుసుకున్నాడు.

అతని చూపు ఆమెని అడుగుతున్నట్టు అనిపించింది: 'ఇంతకుముందు నువ్వు ఆత్మహత్య గురించి నాకు చెప్పావ్; శిశువుగురించి ఏమీ అనలేదు. మరి ఇప్పుడో? ఈ మార్పు నీలో ఎందుకు వచ్చిందని?'

రాధ తనకుతానే మాటాడుతున్నట్టు జవాబు చెప్పింది. "ఇంతకుముందు నేను అవమానం భరించలేక ఆత్మహత్యకి సిద్ధమైయ్యాను. కాని ఇప్పుడు నాకు abortion తప్పక కావాలి." ఆ రోజు డాక్టరు తన ఉద్యోగంగురించి అడిగినప్పుడు తను కోపంతో "నేను ఎటువంటి నేరమూ, పాపమూ చెయ్యలేదు . . . " అని అన్న మాటలు ఆమెకు గుర్తుకు వచ్చాయి; కాని ఇప్పుడు తన పరిస్థితిని తలచుకొని ఆమె నవ్వేసింది.

'నా వృత్తి గురించి అందరికీ తెలుసుకదా?' అని అంటూ ఒక దీర్ఘమైన నిట్టూర్పు వదిలింది.

రాఘువన్ తన మనసు విప్పి దృఢంగా ఆమెకు చెప్పాడు:

"నువ్వు ఇప్పుడు చెయ్యబోయేది చట్టంకి విరుద్ధం. అది అపవిత్రమైన పని. ఇంతకుముందు నువ్వు చేసిన నేరంకి నువ్వు జవాబుదారీ కాదు. ఒక మగవాడిని నమ్మి నువ్వు మోసం పోయావ్; ఆత్మహత్యకి బదులు ఆ శిశువు పోయింది. ఇప్పుడు నువ్వు చేసేది స్వార్థం కోసం. నా మాట విను. నీ మనసు మార్చుకో!"

'ఇతనెవడో అసలు లోకజ్ఞానం లేని మనిషి!' అని రాధ తనలో గొణుక్కుంది.

"నేను చేసేది నేరం అని మీరు అంటున్నారు. కొంచెం ఆలోచించండి. ఈ శిశువుకి మూల కారణమూ ఒక అపవిత్రమైన పనే, అవునా? ఇక ఈ శిశువు పుట్టినతరువాత దానికి తన తండ్రి పేరు తెలియక ఆది నిత్యమూ తల్లిని శపించుతూంటే ఆ పాపమూ నేనే భరించాలి. కాదంటారా? ఇప్పుడు ఆ శిశువు జన్మ ఆపుదలవలన నేనేదో కొత్తగా నేరం చెయ్యటం లేదు . . . నేనంతా బాగా ఆలోచించే ఏం చెయ్యాలో నిశ్చయించాను . . . రేపు ఆ బిడ్డ 'నా తండ్రి ఎవరు?' అని అడిగితే - నేనేం చెప్పను? అటువంటి మగవాడిని నేను కల్పనకూడా చెయ్యలేను!"

ఆమె మాటలు విని రాఘువన్ కి దిగ్భ్రమ కలిగింది. ఆమె వాదంలో పెర్రి ఆవేశంతోబాటు గూఢమైన సత్యమూ ఉందని గ్రహించాడు.

యువతి ఒక పెద్ద  సమస్యలో చిక్కుకుందని ఇద్దరూ ఏకీభవించారు, దానిగురించే మాటాడారు.

రాఘువన్ రాత్రిభోజనంకి రాధని పిలిచాడు. ఇద్దరూ కలిసి భోంచేసారు.

ఇంతలో రాఘువన్ ఒక గంటకిపైగా ఆలోచిస్తూనేవున్నాడు. ఆఖరికి అతను ఒక నిర్ణయంకి వచ్చాడు. అది విని రాధ నివ్వెరపోయింది: 'మా ఇద్దరిలో ఎవరికి మతిపోయింది - డాక్టరుకా లేక నాకా?' అని ఆమె మనసు తారుమారైంది.

రాఘువన్ ఆమెకు చెప్పాడు:

"నిండుప్రాణాన్ని బలితీసుకుంటే అది తల్లికి పాపం, వైద్యుల వృత్తికి ద్రోహం. ఇదిగో, నా మాట విను. నీ బిడ్డకి ఒక తండ్రి కావాలి. అదేనా నీ ప్రశ్న? ఎవరైనా అడిగితే డాక్టరు రాఘువన్ దాని తండ్రి అని చెప్పేయ్. నేను కాదనను. ఇది నేను నీకు ఇస్తున్న వాగ్దానం."

ఆ మాటలు విని రాధ భ్రమించిపోయింది; ఇద్దరూ ఒక నిమిషం ఒకరినొకరు - మౌనంగా - చూసుకున్నారు.

తను చెప్పినది ఏదో ఆవేశంలో చెప్పిన మాటలని రాధ అపార్థం చేసుకుంటుందేమో అని రాఘువన్ అనుమానించాడు. గొంతు సవరించుకొని తన ఆలోచన ఆమెకు వివరించాడు:  "నేనేదో నీమీదున్న సానుభూతి, జాలివలన ఈ సలహా ఇవ్వటంలేదు. ఇందులో కొంచెం స్వార్థమూ ఉంది. రేపు నా స్నేహితులు మనిద్దరిగురించి అన్నివిధాల గాలిమాటలు చెప్పుకుంటే నాకేం అభ్యంతరం లేదు. అటువంటి వదంతులు వినడానికి నాకిష్టమే." ఆ వదంతుల కారణంగా సాగబోయే రకరకాల దృశ్యాలు అతని మనసులో - ఊహా ప్రపంచంలో - లేచాయి.

ఇటువంటి మహాత్మైన డాక్టరుగరించి తనుచేసిన పొరబాటు గ్రహించి రాధ బాధపడింది. అతనికి తనంటే ఎంత ప్రేమ! గతకాల దుర్ఘటననుంచి తన్ను కాపాడాలని అతనికి ఎంత పట్టుదల! వెంటనే అతని కాళ్ళలోపడి ఆమె శరణుకోరింది; ఏడుస్తూ తన కృతజ్ఞత చెప్పుకుంది: "డాక్టరుగారూ, మీరే నన్ను రక్షించారు. ఇక నా బతుకంతా మీ

సేవలోనే సాగనీ! మీలాంటి మహాపురుషుల మాటకొస్తే నేను ఎంతమంది బిడ్డలకైనా తల్లిగా ఉండగలను!" అని అభయమిచ్చింది.

ఆమె బాహటంగా, తనకుతానే గొణుక్కున్న ఆ మాటలు రాఘవన్ మొహాన్ని ఒక సూది దారంతో కుట్టుతున్నట్టు వేధించాయి; అతని ముక్కు, పెదిమలు వణికాయి; ఇక తాళలేక, రాఘవన్ ఒక బిడ్డలాగ వెక్కి వెక్కి ఏడ్చాడు.

అతని ధోరణి చూసి రాధ నివ్వెరపోయింది: ఇదేంటి, వయసువచ్చిన ఒక మగవాడు, తన రెండు చేతులతో మొహాన్ని కప్పుకొని ఇలా విలపించడమా? అతని రెండు భుజాలూ కిందకి బాగా వాలిపోయాయి, కంఠంలోని నరాలు నిక్కపొడుచుకొని కనిపించాయి.

వీటికంతా కొంచెం సమయం పట్టింది.

ఆ తరువాత సముదాయించుకొని రాఘవన్ ఆమెకి చెప్పాడు.

"రాధా, నన్ను క్షమించు! నీ ఆశలు వృధా. వాటిని నిలబెట్టడం నాకు చేతకాని పని! నిజం చెప్పాలంటే ఇప్పుడు నీ కడుపులోవున్న శిశువుకే నేను తండ్రిగా ఉండగలను. నువ్వు అనుకుంటున్నట్టు . . . " తన యిక్కట్టు ఆమెకు ఎలా తెలియజేయాలని తెలియక, తల వంచి, అతను ఆమె చెవిలో ఆ 'రహస్యం' చెప్పాడు.

అలవాటుగా, ఆ రహస్యమేదో బాహటంగా, నిస్సంకోచంగా ఆతను రాధకి చెప్పలేకపోయాడు. ఇంతవరకూ లైంగిక చర్చలలో తన అభిప్రాయాలు, తీర్పులు వ్యక్తిగతం కావని ఆతను పదే పదే వాదించాడు; కాని ఇప్పుడు అతని మాటాడుతున్నది తన సొంత ప్రశ్న గురించి, తను పడుతున్న యిబ్బంది గురించి. మనసు ధుమధుమలాడుతుంటే ఆఖరికి స్వార్థమే గెలిచింది.

రాధ అతని రహస్యం విన్నది. అతని మొహాన్ని తన చేతులతో కప్పుకొని, కౌగిలించుకొని అతనికి ఆశ్రయం ఇచ్చింది.

చీకటిలో తన్ను కలుసుకొని మాయమైన ఆ మొహం తెలియని యువకులని రాధ గుర్తుచేసుకుంది. తన ఆత్మలో తన్ను కలుపుకొని చెంతచేరే ఈ మగవాడి మొహాన్ని తన రెండు చేతులతో అందుకుంది. ఆ పిరికిపందలకంటే ఇతనే ధైర్యశాలి, సింహంలాంటి మనిషి అని ఆమెకు అనిపించింది. అతని మొహంలో తన ఆడ జన్మ

ఇంతవరకూ అనుభవించని  పురుషత్వం, తేజస్సు కనిపించడంలో ఆమెకు తృప్తి, గర్వమూ కలిగాయి. అతన్ని నిండారుగా  కౌగిలించుకుంది. ఆమె తమ్మె రాఘవన్ కన్నీళ్ళతో తడిసిపోయింది.

********